క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునుంచే వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పలువురు పిండి వంటలు,చీర,ఫల,పుష్పాలు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అబ్దుల్ సలాంకు సన్మానం



అబ్దుల్ సలాంను సన్మానిస్తున్న దృశ్యం

శిరివెళ్ల: వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడుగా బీ.అబ్దుల్ సలాం ఇటీవల ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్కాకుల చంద్ర ఆధ్వర్యంలో కార్యకర్తలు ఆయనను ఘనంగా సన్మానించారు. పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేద్దామని అబ్దుల్ సలాం సూచించారు. ఉప సర్పంచు ఇంతియాజ్ పాల్గొన్నారు.

ఐఆర్, డీఏ బకాయిలు చెల్లించాలి



జెండాను ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

నంద్యాల(అర్బన్): ఉపాధ్యాయులకు రావాల్సిన 35 శాతం ఐఆర్ సత్వరమే ప్రకటించాలని, పెండింగ్ డీఏ బకాయిలను ఇవ్వాలని పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీవైష్ణవ కరుణానిధిమూర్తి అన్నారు. నంద్యాల మండలం పెద్దకొట్టాల సమీపంలోని శివ గార్డెన్ ప్రాంగణంలో పీఆర్‌టీయూ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా అధ్యక్షుడు రామపక్కీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ఉపాధ్యాయులకు వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేసిందన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరరెడ్డి, ప్రధాన కార్యదర్శి చాంద్‌బాషా, జిల్లా గౌరవాధ్యక్షుడు భార్గవరామయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట సమీపంలో కొచ్చెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయినట్లు హైవే పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. బేతంచెర్లకు చెందిన అశోక్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా ముందు వెళ్తున్న కారును తప్పించబోయి ప్రమాదానికి గురైనట్లు చెప్పారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో ఐదు గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రె

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెట్నికోటలో కుక్కల దాడిలో ఆదివారం ఐదు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన చిన్న ఓబన్న ఉన్నత పాఠశాల సమీపంలో గొర్రెల మందను ఏర్పాటు చేసుకున్నాడు. కుక్కలు మందలోకి చొరబడి దాడి చేయడంతో ఐదు గొర్రెలు మృతి చెందాయి. మళ్లీ కుక్కలు గొర్రెల వద్దకు వస్తుండడంతో వాటిని తరిమాడు. దీంతో ఆగ్రహించిన కుక్కల యజమానులు గొర్రెల యజమాని ఓబన్నపై దాడికి పాల్పడడంతో గాయపడ్డాడు. ఈ విషయంపై బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రోడ్డు భద్రతపై అవగాహన



డ్రైవర్లు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రామాంజినాయక్

శ్రీశైలంప్రాజెక్ట్: రోడ్డు భద్రత, సైబర్ క్రైం, మహిళలపై అఘాయిత్యాలపై ఆదివారం సాయంత్రం టూటౌన్ అవుట్‌పోస్టులో ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ స్థానిక డ్రైవర్లు, ప్రజలకు అవగాహన కల్పించారు. అతివేగంతో వాహనాలు నడిపి, ఒక్కోసారి ఎదుటివారు చేసే తప్పుతో కూడా ప్రాణాలు కోల్పోతామని, డ్రైవర్లు వాహనాలను కండీషన్‌లో ఉంచుకొని భద్రత నియమాలు పాటించాలన్నారు. సెల్‌ఫోన్‌ల వాడకం ఎక్కువైన తరువాత సైబర్‌క్రైం పెరిగిందని, అపరిచిత కాల్స్, పోస్టులపై స్పందించరాదని సూచించారు. అలాగే డిజిటల్ పేమెంట్‌లపై జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ జి.చంద్రబాబు, ఎస్ఐ బి.వి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల ఆక్రమణకు తమ్ముళ్ల కుట్ర

- కానాలలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 620 మందికి ఇళ్ల పట్టాలు
- గృహాలు నిర్మించుకోలేదంటూ స్థలాల స్వాధీనానికి కూటమి నాయకుల యత్నం
- పునాదులను అడ్డుకున్న వైనం
- ఆందోళనలో లబ్ధిదారులు
- న్యాయం చేయాలంటూ అధికారులకు వేడుకోలు



కంపెనీ కొట్టాల సమీపంలో పునాది దశలో ఇంటి నిర్మాణం



సచివాలయం వద్ద ఇళ్లను నిర్మించిన దృశ్యం

నంద్యాల(అర్బన్): సెంటు భూమి పేదలకు అందజేయని చంద్రబాబు ప్రభుత్వం.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు అందజేసిన ఇళ్ల స్థలాల్లో నిర్మాణాలు చేపట్టని వారి పట్టాల రద్దుకు నిర్ణయించింది. ఆ స్థలాలను స్వాధీనం చేసుకొని తమ కార్యకర్తలకు కట్టబెట్టే ఎత్తుగడకు తెరతీసింది.

వైఎస్సార్‌సీపీ హయాంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నంద్యాల మండలంలోని కానాల గ్రామంలో దాదాపు 620 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాల అందజేశారు. సొంతిళ్లు లేని పేదలు ఉండకూడదనే లక్ష్యంతో కులం, మతం, పార్టీలు చూడకుండా.. రాజకీయం చేయకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ పేదలకు 5 లే అవుట్లలో 620 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. సొంత స్థలం ఉన్న వారికి సైతం హౌసింగ్ సాయం అందేలా చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల సాయం మంజూరుకే పరిమితం కాకుండా జగనన్న కాలనీల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి తాగునీరు, రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ తదితర సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకున్నారు. పదేళ్ల తర్వాత ఇంటిపై సర్వహక్కులు ఉండేలా లబ్ధిదారుల పేరిట స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి కన్వెన్షన్ డీడ్ అందజేసి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. అందుకోసం అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించి లబ్ధిదారుల పేరిట ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు.

ఖాళీ స్థలాలపై కూటమి నాయకుల కన్ను...

ఇప్పటికే స్థలాలు పొంది ఆర్థిక ఇబ్బందులతో ఇళ్లు నిర్మించుకోని వారి స్థలాలపై కూటమి నాయకులు కన్నేశారు. పాత కేటాయింపులు రద్దు చేసి తమ వారికి కొత్త కేటాయింపులు చేసే పనిలో కూటమి ప్రభుత్వం ఉంది. రెండు రోజుల క్రితం జరిగిన కేబినేట్ సమావేశంలో ఇళ్లు కట్టుకోని వారి స్థలాల రద్దుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నంద్యాల మండలం కానాల గ్రామంలో బైరేష్ ఇంటి నిర్మాణంలో భాగంగా పునాదులు వేస్తుండగా.. స్థానిక టీడీపీ నేతలు అడ్డుకోవడం చర్చనీయాంశమైంది. దీంతో గ్రామంలో నిర్మాణాలు చేపట్టని 350 మంది నిరుపేదల సొంతింటి ఆశలు ఆవిరికానున్నాయి. నిరుపేదలకు ప్రభుత్వం ఇవ్వాల్సింది పోయి వారి నుంచి లాక్కోవాలనుకోవడం సరికాదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ ప్రభుత్వానికి పెట్టే మనసు లేదు



పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చే కార్యక్రమాన్ని వైఎస్సార్ మొదలు పెట్టారు. పదేళ్ల తర్వాత వచ్చిన జగన్‌మోహన్ రెడ్డి పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి శాశ్వత హక్కు కల్పిస్తూ పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించారు. ఇప్పుడు పేదలకు ఇచ్చిన స్థలాలను కూటమి ప్రభుత్వం లాక్కోవాలని చూడటం దుర్మార్గం. పేదలకు ఇచ్చే మనస్తత్వం చంద్రబాబు ప్రభుత్వానికి లేదు. ఇవ్వాలన్న ఆలోచన లేకపోగా.. వారికి అందజేసిన వాటిని లాక్కోవడం సరికాదు. -దూదేకుల కాశీం, కానాల

ప్రభుత్వ నిర్ణయం సరికాదు



పేదలకు అండగా ఉండి వారి సొంతింటి కలను సాకారం చేయాల్సింది పోయి.. గతంలో పంపిణీ చేసిన స్థలాలను ప్రభుత్వం తిరిగి లాక్కోవాలనుకోవడం సరికాదు. స్థలం ఉందన్న భరోసాతో తమ పిల్లల పెళ్లిళ్లు చేసిన వారు ఎంతోమంది ఉన్నారు. - రసూల్, కానాల

జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీలు



బహుమతులు అందుకున్న విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎంఆర్ గోవిందరెడ్డి జ్ఞాపకార్థం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కంబగిరి రాజు స్మారకార్థం జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీలను నిర్వహించినట్లు కళారాధన ప్రధాన కార్యదర్శి రవికృష్ణ, అధ్యక్షుడు మధుసూదనరావు, గ్రీన్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనిధి రఘువీర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి, ఏఓ ప్రగతిరెడ్డి తెలిపారు. ఆదివారం ఎన్టీఆర్ చిత్రం వేయడంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. జిల్లాలోని 165 మంది బాలబాలికలు పాల్గొన్నారు.

విజేతలు..

ప్రథమ బహుమతిగా రూ.20వేలతో పాటు 2 గ్రాముల బంగారు పతకం గురు రాఘవ కార్తిక్, ద్వితీయ బహుమతి గణేష్ బంగారు పూత పూసిన 20 గ్రాముల వెండి పతకం, తృతీయ బహుమతిగా రాగ చైత్ర బంగారు పూత పూసిన 10 గ్రాముల వెండి పతకం అందుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో లిఖిత్, కావ్యశ్రీ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి వెండి పతకాలను అందుకున్నారు.పది మందికి ప్రత్యేక జూరీ బహుమతులు అందజేశారు.

అలరించిన అష్టావధానం



అవధాని బులుసు అపర్ణను సన్మానిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: గోదాగోకులం, తోపుదుర్తి వెంకట్రామ్ ఆధ్వర్యంలో ఆదివారం నగర శివారులోని గోదాగోకులంలో అవధాని బులుసు అపర్ణ నిర్వహించిన అష్టావధానం ఆహుతులను అలరించింది. విద్వాన్ మారేడు రాముడు, డాక్టర్ తొగట సురేష్ బాబు, డాక్టర్ వీపూరి వెంకటేశ్వర్లు, డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, గొర్రెడ్డి హరిశ్చంద్రారెడ్డి మాదినేని మధుసూదన్, విద్వాన్ మునీశ్వరరావు, తోపుదుర్తి వెంకట్రామ్ పృచ్ఛకులుగా వ్యవహరించారు. మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత కేవీ రాజశేఖర్ అతిథులుగా పాల్గొని మాట్లాడారు. అనంతరం అవధాని బులుసు అపర్ణను సన్మానించారు. గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త, ముద్రిక సాహితీ స్రవంతి వ్యవస్థాపక అధ్యక్షుడు భాస్కర్, గోదాగోకులం పరివారం, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి

గడివేముల: నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, ఇష్ట దైవాన్ని స్మరించుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని శంకరాచార్య స్వయం ప్రకాశ సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి పేర్కొన్నారు. మండల కేంద్రమైన గడివేములలో రాజరాజేశ్వరి పాఠశాలలో ఆదివారం రాత్రి మహాస్వామి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ.. నేటి రోజుల్లో ప్రతి ఒక్కరూ పని ఒత్తిడి ప్రభావం వల్ల మనశ్శాంతిని కోల్పోతున్నారన్నారు. ఆలయాలకు వెళ్లి పూజలు చేయడం, ఇష్ట దైవాన్ని ఆరాధించడం ద్వారా మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కులమతాలకు అతీతంగా ఐకమత్యంగా అందరూ కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుపుకోవాలన్నారు. పలువురు నాయకులు స్వామివారి ఆశీర్వాదం పొందారు.

నాటి పనులకు స్వస్తి

- కనుమరుగవుతున్న అలనాటి వ్యవసాయం
- కూలీలతో నూర్పిడి పనులకు చెల్లు
- ప్రస్తుతం యంత్రాలతోనే కోతలు
- మిరప, పత్తి, వరినాటే పనులు మాత్రమే కూలీలతో చేయిస్తున్న రైతులు

దొర్నిపాడు: కొన్నేళ్ల క్రితం వ్యవసాయంలో కూలీల సందడి కనిపించేది. నాట్లు, కోతల కాలంలో కూలీలకు చేతినిండా పనిదొరికేది. కాలక్రమేణా యంత్రాలు అందుబాటులోకి రావడంతో కూలీల అవసరం తగ్గింది. ప్రస్తుతం మండలంలో జొన్న, కంది, మినుము, శనగ కోత పనులు యంత్రాలతో ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం పట్టుమంటే పది నిమిషాల్లో ఎకరం పొలాన్ని నూర్పిడి చేసి శనగలను రైతన్న దోసిట్లో పోస్తున్నాయి, ఆధునిక వ్యవసాయ యంత్రాలు. ప్రస్తుతం ఎక్కడ చూసినా యంత్రాలే కనిపిస్తున్నాయి. అప్పట్లో ఎకరం శనగ పంటను కోయాలంటే నలుగురు కూలీలు అవసరం అయ్యేవారు. అంతేగాక పంటను ఎండిన తర్వాత ఎడ్లబండి సాయంతో కల్లాల్లో వేసి ట్రాక్టరుతో తొక్కించేవారు. ఆ తర్వాత తూర్పార పట్టేందుకు పద్దినాలు పట్టేది. ప్రస్తుతం కూలీలకు పత్తి తీయడం, మిరపకాయలను కోయడం, వరినాట్లు వేసే పనులు మాత్రమే లభిస్తున్నాయి.



ఈ రాతిగుండును అప్పట్లో రైతులు కంకుల గుండుగా పిలిచేవారు. ఇది రైతులకు ఎన్నో రకాలుగా సాయపడింది. ప్రస్తుతం భాగ్యనగరంలో ఓ కల్లంలో ఇలా కనిపించింది. జొన్న, వరి కోతల సమయంలో కుప్పలుగా పోసిన పంటను కాడెద్దుల సాయంతో పంటపై తిప్పడంతో పంటంతా నూర్పిడి అవుతుంది. ఆ తర్వాత కంకులు, వరిచెత్తను ఇదిలించి గింజలను రాసులుగా పోసి గాలికి తూర్పార పట్టేవారు. ఈ తంతు మొత్తం పూర్తయ్యేందుకు అప్పట్లో రెండు నుంచి మూడు వారాలు పట్టేది.



ఈ అధునిక యంత్రం అరగంటలో ఎకరం జొన్న పంటను నూర్పిడి చేసి జొన్న గింజలను బయటకు తీస్తుంది. గతంలో ముందుగా చొప్ప కోసి ఎండిన తర్వాత కంకులను వేరుగా చేసి మండె వేసి తర్వాత కంకుల గుండుతో తిప్పేవారు. ప్రస్తుతం ఆ కష్టాలు రైతుకు తప్పాయి. చాలా సులభంగా కోతలు జరుగుతున్నాయి. కానీ కూలీలకు మాత్రం రానురాను ఉపాధి కరువవుతోంది.

ఈ చిత్రంలో కూలీల సందడి చేనునిండా కనిపిస్తుంది కదూ. అవును మరి.. ఒక్కప్పుడు శనగ పంటను కోయాలంటే కూలీలు చాలామందే అవసరమయ్యేవారు. గతంలో కోతలు పూర్తయ్యే సరికి ఒక్కక్కరు ఎండాకాలం పూర్తయ్యే వరకు సరిపడ కూలిని సంపాదించుకునే వారు. ఎందుకంటే మార్చి నుంచి జులై వరకు పల్లెల్లో పొలం పనులు ఉండేవి. అప్పట్లో శనగకోతలు కూలీల పాలిట వరంగా ఉండేవి. ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు ప్రాంతాల నుంచి శనగ కోతలకు పెద్ద సంఖ్యలో కూలీలు శనగ కోత పనులకు వచ్చేవారు.



భోగేశ్వరంలో ప్రత్యేక పూజలు



భోగేశ్వరుడికి అభిషేకం చేస్తున్న భక్తులు

గడివేముల: రథసప్తమి సందర్భంగా శైవక్షేత్రమైన భోగేశ్వరాలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ రామానుజన్, ప్రధానార్చకులు శ్యామ్ సుందర్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారి మూలమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం నవగ్రహాల్లో సూర్యదేవుడికి విశేష ద్రవ్యాభిషేకం, అలంకరణ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో అన్నప్రసాదాలు స్వీకరించారు.

అమ్మవారికి పల్లకీ సేవ



స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామి, అమ్మ వార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఆశీనులు గావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజావేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

అథ్లెటిక్స్ పోటీల్లో రాణించిన నంద్యాల మాస్టర్లు

నంద్యాల(న్యూటౌన్): అనంతపురం నగరంలో శనివారం జరిగిన 43వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నంద్యాల జిల్లాకు చెందిన మాస్టర్లు ప్రతిభ చూపి స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారని నంద్యాల జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పెరుమాళ్ల శ్రీనాథ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బండిఆత్మకూరు మండలం సంతజూటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజేష్ 40 సంవత్సరాల పైబడిన విభాగంలో 100 మీటర్లు, 200 మీటర్ల పరుగులో స్వర్ణ పతకం సొంతం చేసుకున్నా. బనగానపల్లె మండలం యాగంటిపల్లి జెడ్పీ హైస్కూల్ పీడీ హరికృష్ణ 800 మీటర్ల పరుగులో రజత పతకం దక్కించుకున్నారు.

27న అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గలో ఈ నెల 27వ తేదీన బాలుర అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు షేక్షావలి, షాషావలి ఆదివారం ఓ ప్రకటలో తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించనున్న ఈ పోటీల్లో విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులు అందించనున్నట్లు ప్రకటించారు. ఆసక్తి గల జట్లు అదే రోజు ఉదయం 8 గంటలకు పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 90146 59220, 97014 78079 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

27న బండలాగుడు పోటీలు

మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో ఈ నెల 27వ తేదీన అంతర్రాష్ట్ర న్యూ కేటగిరీ (ఏడు పళ్ల) విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించే పోటీలలో గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.8 వేల చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్లు వెల్లడించారు.

అటకెక్కిన పరిష్కార వేదిక!

- వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామ సచివాలయాల్లో రోజూ 'స్పందన'
- గంటపాటు ప్రజల నుంచి సమస్యలపై వినతుల స్వీకరణ
- నేడు కార్యక్రమం నిర్వహించని కూటమి ప్రభుత్వం
- మండల, జిల్లా కేంద్రాలకు రావడానికి జనం అవస్థలు



గోస్పాడులో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమం (ఫైల్)

గోస్పాడు: గ్రామాల్లో ప్రజలకు సత్వర సేవలు సకాలంలో అందించాలన్న ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయాలను ఏర్పాటు చేశారు. అంతకుముందు వరకు ప్రజలు సమస్యల పరిష్కారం కోరుతూ మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది.ఇందుకు వారు ఇబ్బందులు పడేవారు. వాటిని తొలగించేందుకు గ్రామ సచివాలయాల్లోనే స్పందన కార్యక్రమం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించేలా చేశారు. స్పందన కార్యక్రమం ప్రతి రోజూ సాయంత్రం మూడు నుంచి నాలుగు గంటల సమయంలో సచివాలయాల్లోనే నిర్వహించేవారు. ఇందుకు పంచాయతీ కార్యదర్శులతో పాటు, సచివాలయంలో అధికారులందరూ కార్యక్రమానికి హాజరయ్యేవారు. గ్రామంలోనే స్పందన కార్యక్రమం ఏర్పాటు చేయడంతో ప్రజలకు ప్రయాణ, ఆర్థిక ఇబ్బందులు, సమయం వృథా కాకుండా అనుకూలంగా ఉండేది.

మళ్లీ కష్టాలు మొదలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. గ్రామ స్థాయిలో ప్రతి రోజూ గంట పాటు జరిగే స్పందన కార్యక్రమంపై చిన్నచూపు చూడటంతో ప్రజలు మండల, జిల్లాస్థాయి స్పందనకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది.గత ప్రభుత్వం మాదిరిగానే గ్రామ స్థాయిలోనే స్పందన కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తే వృద్ధులు, మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని అంటున్నారు. ఆయా గ్రామాల నుంచి ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే ఎన్నో వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తోంది. గోస్పాడు మండలంలో 12 సచివాలయాల్లో 134 మంది సిబ్బంది, నంద్యాల మండలంలో 17 గ్రామ సచివాలయాల్లో 168 మంది సచివాలయ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారి ద్వారా సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

పేరుకుపోతున్న సమస్యలు..

ఆయా గ్రామాల్లోని సమస్యలను అధికారులకు విన్నవించేందుకు ప్రజలు మండల కేంద్రాలకు రావాల్సి ఉండటంతో చాలా మంది ప్రజలు అక్కడికి వెళ్లి సమస్యలు చెప్పుకోలేకపోతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం మండల కేంద్రాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం పేరుతో వారానికోసారి నిర్వహిస్తున్నారు.

గ్రామస్థాయి 'స్పందన'ను కొనసాగించాలి



ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని వెంటనే గ్రామ స్థాయిలో స్పందన కార్యక్రమాన్ని కొనసాగించాలి. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి. గ్రామ స్థాయిలోనే సమస్యలు పరిష్కరించుకునేలా గ్రామ సచివాలయాల్లో గత ప్రభుత్వం నిర్వహించనట్లుగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తే ప్రజలకు అవస్థలు తప్పుతాయి. -నాగేశ్వరరెడ్డి, సాంబవరం

ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు



మండల కేంద్రాల్లో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుంచి రావాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు అవస్థలు పడుతున్నారు. వారి కష్టాలు చెప్పుకునేందుకు గత ప్రభుత్వం గ్రామాల్లోనే స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు కూడా దానిని పూర్తిస్థాయిలో కొనసాగించాలి. -ఆర్థర్ సైమాన్, ఎంపీపీ, గోస్పాడు